క్లుప్తంగా

జీలుగ సాగుతో నేల సారవంతం


కొడిపల్లిలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): జీలుగ సాగుతో నేల సారవంతం అవుతుందని ఏఓ స్వప్న తెలిపారు. శనివారం కౌడిపల్లి మండలానికి 200 బస్తాల జీలుగ విత్తనాలు రావడంతో రైతువేదికలో ఏఈఓలు సాహితి, సౌజన్య రైతులకు టోకెన్లు ఇచ్చి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట విత్తనాలు జీలుగ, జనుము, పెసర సాగు చేయాలన్నారు. పచ్చిరొట్ట సాగు చేసిన తరువాత పూత దశలో నేలలో కలియదున్నాలని సూచించారు. దీంతో రైతులకు సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ప్రతిష్ఠాపన


ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని టీ.మాందాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి బండ్ల, బోనాలు నిర్వహించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాలయ్య, గణేష్, కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


వెంకయ్య కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గజగట్లపల్లి గ్రామానికి చెందిన పసుల వెంకటయ్య కుటుంబానికి గ్రామ నాయకులు అండగా నిలిచారు. మాజీ సర్పంచ్ మీనా రవీందర్, కాంగ్రెస్ నాయకులు మధు, శేఖర్, బీఆర్ఎస్వీ నాయకుడు లింగం రాజేల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి ద్వారా రూ.5వేల చొప్పున రూ.15వేలు జమచేసి బాధిత కుటుంబానికి శనివారం అందించారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్‌లో కొలువైన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు ప్రతియేటా వైశాఖం, జేష్ఠ మాసంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ పురోహితుడు శ్రీనివాస శర్మ తెలిపారు. ధర్మకర్త పట్వారి ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకుని అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందిస్తున్న నాయకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదల పాలిట ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా మారిందని మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర పేర్కొన్నారు. మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామానికి చెందిన బత్తుల ఎల్లమ్మకు శనివారం ఆయన రూ.45 వేలు, ఏర్పుల శ్యామలకు రూ.60 వేలు, బాలగౌడ్ రజినికి రూ. 20 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంగయ్య, నాయకులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

బక్రీద్ సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులు, ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ త్యాగానికి ప్రతీక అని పలువురు మతపెద్దలు వివరించారు. సమైక్యత, సోదర భావాన్ని అందరూ అనుసరించాలని ఆకాంక్షించారు.


చేగుంట(తూప్రాన్): పోతాన్‌పల్లిలో..


శివ్వంపేట(నర్సాపూర్): గోమారం ఈద్గా వద్ద ప్రార్థనలు


వెల్దుర్తి(తూప్రాన్): ముస్లింల సామూహిక ప్రార్థనలు


చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగల్‌లో ముస్లింల ప్రార్థన


నిజాంపేట(మెదక్): నిజాంపేటలో..


కొల్చారం(నర్సాపూర్): కొల్చారం ఈద్గా వద్ద ప్రార్థన


మనోహరాబాద్(తూప్రాన్): ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మైనంపల్లి హన్మంతరావు


పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలో..

ఒకే దేశం..జమిలి ఎన్నికలపై అవగాహన


చిలప్‌చెడ్‌లో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై మాట్లాడుతున్న రాజేందర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): దేశం మొత్తంగా అన్ని రకాల ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే భారీ మొత్తంలో ఖర్చులు కలిసొచ్చి, దేశం మరింత ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని, వన్ నేషన్, వన్ ఎలక్షన్ జిల్లా కో కన్వీనర్ ఖాజీపేట రాజేందర్ అభిప్రాయపడ్డారు. చిలప్‌చెడ్‌లో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...దేశంలో జరిగే ఎన్నికలకు సుమారు రూ.1.36 లక్షల కోట్ల ఖర్చు అవుతందన్నారు. ఒక ఓటరుకు సుమారుగా రూ.1,400 ఖర్చవుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే సుమారుగా రూ.20 వేల కోట్ల ఖర్చు మాత్రమే అవుతుందన్నారు. ఒకేసారి అన్ని ఎన్నికలు నిర్వహిస్తే ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నాగేష్‌యాదవ్, వన్‌నేషన్, వన్ ఎలక్షన్ మండల కన్వీనర్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు చంద్రారెడ్డి, రామకృష్ణ, రాజాగౌడ్, యాదగిరి, ఎల్లప్ప, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


పూజల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా శనివారం ముగిసింది. పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు గౌడ సంఘం నేతలు, ఏర్పాట్లు చేశారు. గ్రామవాసి బండారు గంగాధర్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భాగస్వాములైన వారందరికీ కృతజ్ఞతలు

శివ్వంపేట(నర్సాపూర్): శ్రీ గురుపీఠంలో దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన వారందరికీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు గురుపీఠంలో దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిత్య పూజలతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రమణగౌడ్, భిక్షపతి యాదవ్, హన్మంతు, యాదగిరి పాల్గొన్నారు.

పగలు వెలుగుతున్న వీధిలైట్లు


పగటి పూట వెలుగుతున్న వీధిలైట్లు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వీధిలైట్ల నిర్వహణ సరిగ్గా లేక పోవడంతో పగటి పూట సైతం వీధిలైట్లు వెలుగుతున్నాయి. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన లైట్లు పగటి పూట వెలుగుతున్నాయి. పలు వీధుల్లో ఉన్న వీధిలైట్లకు ఆటోమెటిక్ పద్ధతి సెన్సార్ అమర్చగా పలుచోట్ల అమర్చక పోవడంతో అవి రాత్రింబవళ్లు వెలుగుతున్నందున కరెంటు వృథా కావడంతో పాటు మున్సిపాలిటీపై కరెంటు బిల్లు అనవసరంగా భారం అవుతుందని విమర్శలు వస్తున్నాయి. కరెంటు వృథాను అరికట్టి అనవసర బిల్లును నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

మోదీ పాలనతోనే ప్రజాసంక్షేమం


ఎల్లారెడ్డిని సన్మానిస్తున్న సుభాష్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ప్రధాని నరేంద్రమోదీ పాలనలో పలు ప్రజాసంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మండల ప్రభారి సుభాష్‌రెడ్డి అన్నారు. శనివారం చేగుంట ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో 11 సంవత్సరాల బీజేపీ పాలనలో వందకు పైగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కోవిడ్ కష్టకాలంలో ప్రపంచ దేశాలకు వ్యాక్సిన్ అందించి పలు దేశాల ప్రజల మన్ననలు పొందినట్లు చెప్పారు. ఉచిత రేషన్ బియ్యం పంపిణీ దేశంలోని పేదలకు వరంగా మారిందని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మండల శాఖ అధ్యక్షుడు ఎల్లారెడ్డిని సన్మానించి పార్టీ పటిష్టత కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్ణ పాండు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, భూపాల్, హరిశంకర్, రఘువీర్, రఘుపతి, సాయిబాబా, నాగరాజు, బోగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, మాధవరెడ్డి, కరుణాకర్ రెడ్డి, మహేందర్, ప్రభులింగంగౌడ్, గణేష్, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ యోగా

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ వైద్యులు గోల్కొండ వీధిలో ఇంటింటి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వెనకగల వీధిలో శనివారం స్థానిక మహిళలకు, చిన్నారులకు యోగాసనాలు నేరిపించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఫార్మాసిస్టు యూసుఫ్ మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని యోగాసనాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అటెండర్ లక్ష్మి, స్థానిక మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కొల్చారం(నర్సాపూర్): పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ మండల బాధ్యులు చంద్రం గౌడ్ పేర్కొన్నారు.శనివారం సంగాయిపేటలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు హరీష్ అధ్యక్షతన మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు రవి గౌడ్, ఏగొండ, వెంకట్, ప్రధాన కార్యదర్శి రవికాంత్, గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనుము విత్తనాల పంపిణీ



రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ రైతులకు జనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గొల్ల నర్సింహులు, అమృత్, రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట(నర్సాపూర్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని శభాష్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం చందాయిపేటకు చెందిన షాబుద్దీన్(45) మూడేళ్ల క్రితం కుటుంబంతో కలిసి శభాష్‌పల్లిలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన షాబుద్దీన్ 15 రోజుల క్రితం భార్యపై దాడి చేయడంతో ఆమె కొడుకుని తీసుకొని తన అక్క ఇంటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. బక్రీద్ సందర్భంగా శనివారం గ్రామానికి చెందిన ముస్లింలు మటన్ ఇచ్చేందుకు ఆయన ఇంటికి వెళ్లగా తలుపు గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతదేహం కుళ్లినస్థితిలో ఉండడంతో మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు


కాళ్లకల్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రధాన మంత్రి మోదీ పిలుపు మేరకు బీజేపీ మండల నాయకులు పలు గ్రామాలలో మొక్కలు నాటారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్క వెంకటేశ్‌గౌడ్, నాయకులు పురం మహేశ్ ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండల కేంద్రం, ముప్పిరెడ్డిపల్లి, కాళ్లకల్ గ్రామాలలో శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లేశ్(కరాటే), నర్సింహులు, గణేశ్, కృష్ణ, మహేశ్, నర్సింహులు తదితరులున్నారు.

కొనసాగుతున్న బడిబాట


మల్కాపూర్‌లో బడిబాటలో ఎంఈఓ వెంకటేశం


కోనాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం మండల పరిధిలోని మల్కాపూర్, బద్దారం తదితర గ్రామాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటేశం పర్యవేక్షించారు. అనంతరం తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సదుపాయాలపై వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధీర్, సిద్దిరాములు తదితరులున్నారు.

కోనాపూర్‌లో బడిబాట

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే, నాణ్యమైన చదువుతోపాటు సంస్కారం నేర్పుతామని ఉపాధ్యాయులు సూచించారు. తమ పర్యటనకు గ్రామంలో మంచి స్పందన వచ్చిందని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఇంటింటా బడిబాట

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండల గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విద్య గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి విఠల్ మాట్లాడుతూ...గ్రామాలలో బడిబాట ఇంటింటికీ సర్వే చేసి, వివరాల నమోదు, సర్వే చేసిన ఇంటికి నంబరింగ్ వేయాలన్నారు. డ్రాపవుట్స్ ఉన్న విద్యార్థులను గుర్తించేందుకు ఇంటింటి బడిబాట నిర్వహించామన్నారు. అదేవిధంగా పదో తరగతి పూర్తి చేసి ఖాళీగా ఉన్న విద్యార్థులను, కాలేజీల్లో చేరేవిధంగా ప్రోత్సాహించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ తోపాటు, నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులను బడిలో చేర్పాలి

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బడి బయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే శిక్షణ పొందిన అర్హత కలిగిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని, ఈ అవకాశాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలంటూ నినదించారు. ప్రభుత్వ పాఠశాలలో పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను సర్కార్ బడిలోనే చేర్పించేలా చూడాలని కోరారు.

చెత్తను కాలుస్తున్న ఆసుపత్రి సిబ్బంది


చెత్తకు నిప్పంటించడంతో వస్తున్న పొగ

నర్సాపూర్: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది తమ ఆస్పత్రిలో వచ్చే చెత్తను కాలుస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా సిబ్బంది చెత్తను ఆస్పత్రి ఆవరణలోని ఓ మూలన పోగు చేసి రెండు మూడు రోజులకు ఒకసారి రాత్రి పూట కాలుస్తున్నారు. కాల్చడం వల్ల వచ్చే ఘాటు పొగతో ఆస్పత్రి దగ్గరలో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్తను తడి పొడి చెత్తగా వేరు చేసి మున్సిపాలిటీ సిబ్బందికి అప్పగించాల్సింది పోయి దానికి నిప్పటించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావనిని వివరణ కోరగా తమ ఆస్పత్రి ఆవరణలో చెత్తకు నిప్పంటిస్తున్న విషయం తనకు తెలియదని, తాను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

యువకుడు అదృశ్యం


సురేశ్

తూప్రాన్: యువకుడు అదృశ్యమైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాలకంటి సురేశ్ మనోహరాబాద్ మండలంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగా శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఫోన్‌లో సైతం అందుబాటులోకి రాకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.